

## నేనేం పాపం చేసిన


నాకు భర్త లేడు. పిల్లలు లేరు. ఒంటరి మహిళను. నాకు కొత్త రేషన్‌కార్డు కావాలని సార్లకు మొరపెట్టుకున్న. మొన్న దాంపూర్‌కు వచ్చి పేర్లు సదివింద్రు. గా లిస్టులో నా పేరు రాలే. నాకు కనీసం రేషన్ కార్డు కూడా ఇయ్యరా. అట్లనే ఇందిరమ్మ ఇంటి పథకం లిస్టులో కూడా నా పేరు రాలే. నాకెందుకు ఇల్లు ఇస్తలేరు. నేనేం పాపం చేసిన. గీ కాంగ్రెస్ సర్కారు మాలాంటి పేదోళ్లను గోస పెట్టుకుంటుంది. ఏం లేని దాన్ని.. ఇగ నాలాంటోళ్లకు సాయం చేయకుంటే గీ సర్కారు ఎందుకు.

**- బాసాని లింగమ్మ, దాంపూర్**



## పనులు బంద్ చేసి తిరుగుడైతంది

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ), జనవరి 28 : నా పేరు శ్యాంరావు. నాది బెజ్జూర్ మండలం కుశ్నపల్లి గ్రామం. మా ఊరి శివారులో 6 ఎకరాలు ఉంది. యాసంగి సాగు కోసం దున్నిపిస్తే రూ. 22 వేల దాకా ఖర్చయినయి. ఇగ వరి నాట్ల కోసం మరో రూ. 25 వేల దాకా అయితయి. కాంగ్రెసోళ్లు రైతు భరోసా ఇవ్వకపోవడంతో ఓ సావుకారి వద్ద అప్పు తెచ్చుకున్న. జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా డబ్బుల పడుతయని చెప్పిన్రు. కానీ రెండు రోజుల నుంచి పైసా పడలేదు. గీ కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి రైతులను అరిగోస పెడుతున్నది. గిప్పటి దాకా నయా పైసా పెట్టుబడి సాయమందించింది లేదు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే. రైతుబంధు సాయం ఎప్పటికప్పుడు వేస్తుండే. ఎదురు చూసే పని లేకుండే. ఇప్పుడు రైతుబంధు రావాల్నంటే దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ సభల పొంటి తిరుగాలి. కాంగ్రెసోళ్లు రైతులకు పెద్ద తలకాయ నొప్పి పెట్టిన్రు. పొలం పనులు బంద్ చేసి ఆఫీసులు, బ్యాంకుల సుట్టూ తిరుగుడుకే సరిపోతంది. ఇక ఆత్మీయ భరోసా కింద భూమి లేని పేదేళ్లకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామన్నరు. అది కూడా దిక్కులేదు.



### ఎదురు చూపులే..

# టింగ్ టింగ్ మెస్సేజీల్లేవ్..

మంచిర్యాల, జనవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ పథకాలు అమలు చేస్తున్న తీరుపై జనాగ్రహం వ్యక్తం అవుతున్నది. ఈనెల 26వ తేదీ నుంచి పథకాలు అమలు చేస్తామని చెప్పిన సర్కారు.. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలోనే ఇస్తామంటూ మెలిక పెట్టింది. గణతంత్ర దినోత్సవాన అర్ధరాత్రి 12 గంటలకే రైతులకు రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. టింగ్.. టింగ్.. అని మీ ఫోన్‌లకు మెస్సేజీలు వస్తాయన్నారు. కానీ.. అవి మండలంలోని ఒక గ్రామానికే ఇస్తుండడంపై మిగిలిన గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఆ ఒక్క గ్రామంలోని వారికే ఇచ్చి మిగిలిన వారికి ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నిస్తున్నారు. ఆ ఒక్క ఊరిలో ఉన్న వారే రైతులా? మిగిలిన గ్రామాల వారు కాదా? అంటూ మండిపడుతున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు సమయానికి పెట్టుబడి సాయం రైతుబంధు వచ్చేదని, అందరికీ ఒకేసారి టింగ్.. టింగ్ మంటూ రైతుబంధు మెస్సేజ్‌లు వచ్చేవని చెప్తున్నారు. ఇప్పుడు రైతు భరోసా ఎప్పుడు పడుతుందా? అని ఎదు రు చూడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. రైతు భరోసా ఇకనైనా రైతులందరికీ ఒకేసారి ఇవ్వాల్సిందంటున్నారు. సాగు పంట లు ఎన్ని ఎకరాలు, సాగులో లేని పంటలు ఎన్ని ఎకరాలో తేలకముందే ఆ గ్రామాల్లోని రైతులకు ఎలా వేశారో చెప్పాలంటున్నారు. గత ప్రభుత్వం తొలి రోజులు ఎకరం లోపు, రెండో రోజు రెండు ఎకరాల్లోపు అంటూ విడు తలవారీగా రైతులందరికీ రైతుబంధు వేసేదని, కాంగ్రెస్ సర్కారు కూడా అదే తరహాలో అందరికీ ఒకేసారి వేస్తే బాగుండేది అంటున్నారు.

## రైతు భరోసా రైతులందరికీ ఒకేసారి ఎందుకివ్వరు?

- పైలెట్ గ్రామాల్లోనే ఇస్తే ఎలా? మిగిలిన వాళ్లం రైతులం కాదా?
- ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అరకొరగానే పథకాల అమలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై జనాగ్రహం

### ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అరకొరే..

మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలు అందజేస్తామని చెప్పినప్పటికీ ఆ గ్రామాల్లోనూ పథకాల అమలు లోపభూయిష్టంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. సర్కారు నిర్వహించిన సర్వేలో సేకరించిన సమాచారం ఆధారం గానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఆరు గ్యారెంటీల కోసం అమలు చేసుకున్న సమయంలో, మీ సేవల్లో చేసిన దర ఖాస్తులేవీ పరిగణలోకి తీసుకోలేదని గ్రామ పంచాయతీ అధికారులు చెప్తున్నారు. దీంతో ఇల్లు లేని చాలా మందికి ఇంది రమ్మ ఇండ్లు కూడా రాకుండా పోయాయి. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు ఇంకా న్యాయం జరగలేదని తెలుస్తున్నది. రేషన్ కార్డుల విషయంలోనూ ఇదే జరిగిందని అధికారులు అంటున్నారు. మొన్న గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తుల పరిశీలినకు ఇంకా సమయం పడుతుందని, వారికి వస్తాయో? రావో? అన్న దానిపై తమకే స్పష్టత లేదని చెప్తున్నారు. ఆత్మీయ భరోసా విషయంలో పట్టణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ కూలీలకు సర్కారు మొండిచేయి చూపించి నట్లు తెలుస్తున్నది. గ్రామంలో ఉపాధి కూలీలు చాలా మంది ఉంటే ఏడాదికి 20 రోజుల పని దినాలు ఉన్న వారికే ఇస్తు న్నారనే ప్రచారం జరుగుతుంది. పథకాలు ఇచ్చిన సర్కారు మండలానికి ఒక్క గ్రామానికే కాకుండా, అర్హులందరికీ ఒకే సారి ఇవ్వాలని జనాలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రైతుభరోసా విషయంలో రైతులందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## 'రైతు భరోసా' మాకెప్పుడిస్తరు?



నా పేరు పున్నం పోశం. మాది భీమారం మండలం ఖాజీపల్లి గ్రామం. రెడ్డిపల్లి శివారు ప్రాంతంలో ఎకరంన్నర పొలం ఉంది. కాం గ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదవుతు న్నా రైతు భరోసా రాలే. ఇంకెప్పుడిస్తారో అర్థమైతలే దు. ఒక్క దాంపూర్ గ్రామానికే పథకాలిస్తే మేమెట్లా. మేము ఓట్లు వేయలేదా. ఇట్లా కాంగ్రెసోళ్లు ఎన్నిసార్లు మోసం చేస్తరు. వానకాలం, యాసంగి సీజన్‌లో రైతు భరోసా కింద ఎకరాకు రూ. 7500 ఇస్తమని కాంగ్రెస్ చెప్పి మోసం చేసింది. దాంపూర్‌లోనే మస్తు మంది రైతులకు రైతు భరోసా రాలే.. ఇగ మాకెప్పుడిస్తరు. గీ కాంగ్రెసోళ్లకు పాలన చేసుడు వస్తలేదు. తెలిసీ తెలియని పనులు చేస్తున్నరు.

## నాకు సెంటు భూమి లేదు



కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ), జనవరి 28 : నాకు సెంటు భూమి లేదు. కూలీ పనులు చేసుకుంటున్న. ఆ పని కూడా రోజూ దొరకదు. ఉన్ననాడు చేస్కునుడు.. లేని నాడు ఇంట్లనే ఉండుడు. కుటుంబాన్ని సాకడం మస్తు తిప్పలైతంది. భూమి లేకపోవడం వల్ల రైతుభరోసా ఎలాగూ రాదు. కనీసం ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు అయినా ఇవ్వాలి. మండలానికి ఒక్క గ్రామంలోనే పథకాలను అమలు చేస్తే.. మరి మిగతా గ్రామాలన్నీ ఏమైపోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మా గ్రామంలో కూడా అమలు చేయాలి. ఏం పథకాలో ఏమో.. గిసొంటి సర్కారును ఇప్పటి దాకా సూడలే..

**- పెద్దల సతీశ్, వ్యవసాయ కూలీ, కుశ్నెపల్లి**



# వైభవంగా నాగోబా

పురాతన నాగోబా విగ్రహంతో సంప్రదాయ వాయిద్యాల మధ్య ఆలయానికి తరలిస్తున్న మెస్రం వంశీయులు

- మహాపూజతో ప్రారంభమైన జాతర
- ప్రత్యేక పూజలు చేసిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 28 : కేస్లాపూర్‌లో నాగోబా ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి సంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నాగోబాకు మహాపూజ నిర్వహించేందుకు మెస్రం వంశీయులు ఉదయం 11 గంటలకు శ్రీకారం చుట్టి.. రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. జాతర అధికారికంగా 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. మహాపూజకు ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది మెస్రం వంశీయులు, ఆదివాసులు తరలిరావడంతో నాగోబా ఆలయం కిక్కిరిసింది. కేస్లాపూర్‌లోని పురాతన(మురాడి) నాగోబా విగ్రహంతో మెస్రం వంశీయులు భాజా భజంత్రీలతో ఆలయానికి చేరుకున్నారు. ముందుగా మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించి ఆలయంలోకి ప్రవేశించారు. పురాతన విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఏర్పా టు చేసి, నాగోబా దేవత, సతీదేవత, బాన్‌దేవత, పుర్స పేన్ దేవతకు పూజలు చేసి దర్శించుకున్నారు.

# ఓరియంట్ ఎన్నికలు లేనట్లేనా..!

కాసిపేట, జనవరి 28 : కాసిపేట మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనా.. అంటే ఔననే సమాధానం వస్తున్నది. ఎన్నికల నిర్వహణపై ఈ నెల 28న ఫైనల్ చేస్తామని ఇటీవల జరిగిన సమావేశంలో తెలపగా, చివరకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ఓరియంట్ కంపెనీని అదానీ గ్రూపులు కొనుగోలు చేయడంతో యాజమాన్య మార్పు పక్రియ కొనసాగుతుందని, ఎన్నికలు వాయిదా వేయాలని ఓరియంట్ యాజమాన్యం ఇప్పటికే డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కోరింది. దీంతో పాటు ప్రస్తుతం పోలీస్ సిబ్బంది పలు విధుల్లో బిజీగా ఉండడం వల్ల బందోబస్తు ఏర్పాటు కష్టంగా ఉంటుందని, శాంతి భద్రతల విషయంలో ఇబ్బందులు ఉంటాయని, ఎన్నికలు వాయిదా వేయాలని అందిన నివేదికల ఆధారంగా డిప్యూటీ లేబర్ కమిషనర్ ఓ నిర్ణయానికి వచ్చారు. సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, తర్వాత నిర్వహించే తేదీని తెలియజేస్తామని యూనియన్లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇక ఇప్పట్లో ఎన్నికలుండే పరిస్థితి లేకపోవడంతో ఓరియంట్ కార్మికులు నిరాశకు గురవుతున్నారు.



దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ

# నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 28 : ఈ నెల 29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, ఇందు కోసం మొత్తం 39 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దాదాపు ఐదు వేల మందికిపైగా విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల అదనపు కలెక్టర మోతీలాల్, జిల్లా విద్యాధికారి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- విద్యార్థి దశనుంచే ప్రయోగాలపై దృష్టి పెట్టాలి
- భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ చైర్మన్ (డీఆర్‌డీవో) డా.సతీశ్‌రెడ్డి
- మంచిర్యాలలో ఇన్‌స్పైర్ ఇండియా-2025 వన్ డే స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో

మంచిర్యాల అర్బన్, జనవరి 28 : యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై దృష్టి పెట్టాలని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ చైర్మన్ (డిఆర్‌డీవో) డా.సతీశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని క్వారీ రోడ్డులో గల శ్రీ ఉషోదయ సీబీఎస్‌సీ పాఠశాల మైదానంలో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, యార్లగడ్డ అభిరామ్ మెమోరియల్ గ్రామ సేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ ఇండియా-2025 వన్ డే స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఇస్రో సైంటిస్ట్ శివశంకర్, కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సంస్థ నిర్వాహకుడు నరేశ్‌తో కలిసి సైన్స్ ఫెయిర్ (సాంకేతిక, రక్షణ విభాగానికి సంబంధించిన నమూనాల పరికరాలు)ను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, ఇస్రోల సాయంతో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వంద రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిఫెన్స్ ఏరో స్పేస్‌కు సంబంధించిన పరికరాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాలలో మొదటి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలన్నారు. తెలంగాణ ప్రాంతంలోని పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెట్టాలని, అది విద్యార్థులకు నేర్పించాలనే ఉద్దేశంతో 350 మిలియన్ డాలర్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ దేశ రక్షణలో పాలు పంచుకునేందుకు మంచి అవకాశమన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీ ఉషోదయ పాఠశాల నిర్వాహకులు యార్లగట్ట బాలాజీ, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, డీఎస్‌వో మధుబాబు, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మున్సిపల్ తాజా మాజీ వైస్ ప్రెసిడెంట్ సల్ల మహేశ్, మాజీ కౌన్సిలర్లు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఆర్‌డీవో చైర్మన్ డా.సతీశ్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

# ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలి

- టీజీఎస్ ఆర్టీసీ కరీంగనర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్
- ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి సన్మానం.. అవార్డుల ప్రదానం

మంచిర్యాలటౌన్, జనవరి 28 : ప్రమాదాల నివారణే లక్ష్యంగా టీజీఎస్ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, సిబ్బంది పనిచేయాలని సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు, ప్రగతిచక్ర అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం మంచిర్యాల డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో డ్రైవర్లు, కండక్టర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, వారి సమన్వయంతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్మికులను ప్రోత్సహించడం కోసమే డిపో పరిధిలో నెలకోసారి, రీజియన్ పరిధిలో మూడునెలలకోసారి, జోనల్ పరిధిలో ఆరు నెలలకోసారి ఉత్తమ అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. మిగతా రీజియన్లతో పోల్చుకుంటే ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రమాదాల సంఖ్య తక్కువగా ఉందని, ఇంకా ఈ సంఖ్యను తగ్గించాలని సూచించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్, వరంగల్ రిజినల్ మేనేజర్ మాధవరావు, డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్, మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్, ఆసిఫాబాద్ డీఎం విశ్వనాథ్, ఆదిలాబాద్ డీఎం కల్పన, అధికారులు, తలదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్

### బస్సుల సంఖ్యను పెంచాలని వినతి

మంచిర్యాలకు వచ్చిన ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్‌కు ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు సత్తయ్య పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. లహరి బస్సును బెంగళూరుకు నడపాలని, గుంటూరుకు మంచిర్యాల నుంచి బస్సును నడపాలని, బస్టాండ్‌ను విస్తరించి, బస్సుల సంఖ్య పెంచాలని, అందుకు తగ్గట్లు డ్రైవర్లు, కండక్టర్ల సంఖ్యను పెంచాలని కోరారు. ఆర్టీసీ క్వార్టర్లు ఆధునీకరించాలని విన్నవించారు.

### అవార్డులు పొందిన వారు..

- **ఇంధన పొదుపు విభాగంలో :** ఏ రాజేశ్వర్ (ఆసిఫాబాద్ ), ఎస్ కే అసదుల్లా (నిర్మల్ ), రాంశ్రీనివాస్, తిరుపతి, కే శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్ (మంచిర్యాల), జే రాజేశ్వర్, కే హన్మంత్ , ఏఎస్ నారాయణ (నిర్మల్ ), హుస్సేన్‌బిన్ (ఆదిలాబాద్)
- **ఉత్తమ కండక్టర్లు :** సుభాష్, చంద్రయ్య, విశ్వజిత్, హరిసింగ్, దేవయ్య (ఆసిఫాబాద్), జేఈ సింగ్ (ఆదిలాబాద్), కే మల్లేశ్ (నిర్మల్)
- **ఉత్తమ టిమ్ డ్రైవర్లు :** ఎస్‌డీ అలీమ్, ఎండీ రఫీక్ అహ్మద్ (నిర్మల్ ), బీదశరథ్ (మంచిర్యాల )
- **హైర్ బస్ డ్రైవర్లు :** మల్లేశ్, నరేందర్, అలీం, ఎస్కే జబ్బార్, జేఏ అనిల్ (నిర్మల్ )
- **గ్యారేజీ స్టాఫ్ :** శంకర్ (భైంసా), ఎం రామయ్య (ఆసిఫాబాద్ ), ఎస్ శ్యాం (నిర్మల్ )